## క్లుప్తంగా

### 23న శ్రీముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్రకాలనీలో శ్రీముత్యాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. 23వ తేదీ ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు అమ్మవారికి పంచామృత అభిషేకం, 7.30 గంటలకు శ్రీచక్రమునకు శ్రీ లలిత సహస్రనామం, 8.30 గంటలకు కుంకుమార్చనలు, 9 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం, అనంతరం శివ పార్వతుల కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ కోరింది.

### బాధ్యతల స్వీకరణ


దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును, పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌లను కమిషనర్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

### పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్


బాలయ్యనగర్‌లో ఆధార్ నమోదు చేసుకుంటున్న మహిళలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధి బాలయ్యనగర్ కమ్యూనిటీహాలులో గురువారం పోస్టల్ అధికారుల ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్‌తో పాటు బాలికలకు సుకన్య సంవృద్ధి యోజన, రూ.396లకు బాలూరకు రూ.10 లక్షల విలువ చేసే ప్రమాద బీమా సేవలను కల్పించారు. పీఆర్ఐపీ జేవీబీ రమారావు, డిప్యూటీ ఎస్‌పీఎం ప్రకాష్‌రెడ్డి, ఆధార్ ఆపరేటర్ మోహన్‌బాబు, పోస్ట్‌మెన్ శంకర్‌లు సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, సభ్యులు పార్వతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### మహిళా అదృశ్యం


నాగమణి (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాజ్‌పేయినగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసముండే సజ్జ శ్రీను, నాగమణి (38)లు భార్యాభర్తలు. కాగా 18వ తేదీ ఉదయం 9గంటలకు పనిపై వెళ్తున్నానని చెప్పి వెళ్లిన నాగమణి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. నాగమణి తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి దాతల విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం స్థానికంగా ఉండే శివహరిపరసాద్ తన వంతు సహాయంతో రూ.లక్షను విరాళంగా డిప్యూటీ మేయర్, ఆలయ సభ్యులు ధన్‌రాజ్‌యాదవ్, ఉంగరాల శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ రెడ్డి,స్థానికులు లింగయ్య, రాంబాబు ఉన్నారు.

# కంటి వెలుగు ఆరంభం..

## పేదల కళ్లలో ఆనందం

- మొదటిరోజు 1623 మందికి కంటి పరీక్షలు
- అవసరమైన వారికి అక్కడే కళ్లద్దాల అందజేత
- కేంద్రాలును ప్రారంభించి పరీక్షల తీరును పరిశీలించిన ప్రజాప్రతినిధులు


పద్మానగర్ ఫేజ్-2లో పరీక్ష చేయించుకుంటున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్


సూరారం కాలనీ కంటి వెలుగు కేంద్రంలో జనం


సూరారం కాలనీలో కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన తల్లి కొడుకులు కళావతి (85), వెంకటేష్ (62)


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


సాయివిలేజ్ అపార్ట్‌మెంట్‌లో కళ్లద్దాలు అందజేస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి


దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కంటి వెలుగు కార్యక్రమానికి మొదటి రోజు విశేష స్పందన లభించింది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని 9ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 1,114 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. వీటిలో పలువురికి కంటి అద్దాలు అక్కడికక్కడే అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి, కొంపల్లి సన్న శ్రీశైలంయాదవ్, దుండిగల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ కృష్ణవేణిలు మున్సిపాలిటీల పరిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించగా 509 మందికి పరీక్షలు నిర్వహించారు.

◆ గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్‌లో కార్పొరేటర్లు జగన్, రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, విజయ్‌శేఖర్‌గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తే.. ఎమ్మెల్యే వివేకానంద సుభాష్ నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్ల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద, ధనిక, కుల మతాల తేడా లేకుండా అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా ఉచితంగా కళ్లద్దాలు, అవసరమైతే ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటోందన్నారు.

◆ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ, గౌరవం పెంచడంతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నారని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణను అనుసరిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఉపకమిషనర్ మంగతాయారు, ఈఈ కృష్ణ చైతన్య, డీఈఈ పాపమ్మ తదితరులు ఉన్నారు.

**ఈ కేంద్రాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా..**
దుర్గా ఎస్టేట్ కమ్యూనిటీహాల్, గాంధీనగర్ కమ్యూనిటీహాల్, పద్మానగర్ ఫేజ్-2లో మూడు ప్రాంతాల్లో కంటి వెలుగు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 1623 మందికి మొదటి రోజు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

## కార్మికులను పర్మినెంట్ చేసే వరకు పోరాడతాం

**ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్**


సమావేశంలో మాట్లాడుతున్న యూసూఫ్

రంగారెడ్డినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తూ వారి హక్కులను కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్, కార్యదర్శి బాలరాజు అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా సమితి సమావేశం ఐడీఏ జీడిమెట్లలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. చట్ట సభల్లో కార్మిక సమస్యలను ప్రస్తావించే ప్రతినిధులను పంపాల్సిన అవసరం ఉందన్నారు.

◆ రానురాను కాంట్రాక్ట్ విధానంలో పనిచేసే కార్మికుల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగై కార్మికులు తమ హక్కులను పూర్తి కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్మికులందరిని పర్మినెంట్ చేసే విధంగా పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేల వేతనం అమలు చేసేలా ప్రభుత్వాలు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

◆ ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి చంద్ర, జిల్లా కార్యదర్శి జయచంద్ర, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు హరినాథ్, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, శేఖర్, బాచుపల్లి మండల కార్యదర్శి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, పరమేశ్వర, నగప్ప, సాయులు, తులసి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ల వారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి


శ్రీనివాస హౌసింగ్ సొసైటీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించేకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ శ్రీనివాస హౌసింగ్ సొసైటీలో చేపట్టనున్న రోడ్ ప్యాచ్ వర్క్, భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆవుల పావనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్‌ల వారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరి, సురేష్‌రెడ్డి, బాలాజీనాయక్, బీఆర్ఎస్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ యాదవ్, బీసీసెల్ ప్రెసిడెంట్ తలారి సాయిముదిరాజ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## ఫుట్‌పాత్ రీడిజైనింగ్‌కు చర్యలు చేపట్టండి

**ఎమ్మెల్యే వివేకానంద్**

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఐడీపీఎల్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలుగుతుందని ట్రాఫిక్, లాఅండ్‌ఆర్డర్ పోలీసులు అభ్యంతరం వెల్లుబుచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ఐడీపీఎల్‌ను జంక్షన్‌ను సందర్శించారు. ఐడీపీఎల్ జంక్షన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కమర్షియల్ షటర్లను ఏర్పాటు చేసేందుకు ఫుట్‌పాత్‌లను మరింత వెడల్పు చేశారు. అయితే దీంతో జంక్షన్ వెడల్పు అయినా రోడ్డు మాత్రం కుంచించుకుపోయింది. దీంతో భవిష్యత్‌లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, సిగ్నల్ పడితే ఫ్రీ లెఫ్ట్ తీసుకునేందుకు వీలు లేకుండా ఉందని ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, బాలానగర్ లా అండ్ ఆర్డర్ ఏసీపీ గంగారామ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసి ఫుట్‌పాత్ రీడిజైనింగ్‌కు చర్యలు చేపట్టాల్సిందిగా ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్‌గౌడ్‌లను ఆదేశించారు. డీఈఈ రూపాదేవి, సీఐలు భాస్కర్, నరహరి, చంద్రశేఖర్, కన్సల్టెంట్ పూజిత, ఏఈ సంపత్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య తదితరులు ఉన్నారు.

## సమష్టిగా పనిచేస్తే బీజేపీ గెలుపు ఖాయం

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్**


మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

చింతల్: కార్యకర్తలు సమష్టిగా పని చేస్తే కుత్బుల్లాపూర్‌లో బీజేపీ గెలుపును ఎవ్వరు ఆపలేరని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఐడీపీఎల్‌లోని ఐశ్వర్య కన్వెన్షన్ హాలులో బీజేపీ ముఖ్య నాయకులు, ప్రవాస్ యోజన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు శ్రీశైలంగౌడ్, యెండ లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరై నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపై చర్చించారు. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. దీనిని కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని బీజేపీ వైపు ప్రజలు ఆకర్షితులయ్యేలా సమష్టిగా పని చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, అసెంబ్లీ ప్రభారీ పాపయ్యగౌడ్, పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్, కో-కన్వీనర్ ఎంఆర్ఎస్ రాజు, జిల్లా నాయకులు, డివిజన్ల ఇన్‌చార్జీలు, అధ్యక్షులు, ప్రవాస్ యోజన సభ్యులు పాల్గొన్నారు.

## ఫోన్లు దొంగలిస్తున్న వ్యక్తి అరెస్టు

కుత్బుల్లాపూర్: మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలం, దనోరా కె.శంకర్‌గూడకు చెందిన జావాడే గోపాల్ (29), మోతే ఆకాష్‌లు ప్రైవేట్ హాస్టళ్లలోకి రాత్రిళ్లు, తెల్లవారుజామున ప్రవేశించి విలువైన మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతూ వస్తున్నారు. వీరిపై పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో రెండు, దుండిగల్ పీఎస్‌లో ఒకటి, కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో ఒక కేసులు నమోదయ్యాయి. గురువారం ఉదయం సుచిత్ర చౌరస్తాలో మొబైల్ ఫోన్లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న గోపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనాల చిట్టా బయట పడింది. దీంతో అతని వద్ద నుంచి 14 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కాగా నిందితుడిపై గతంలో ఆదిలాబాద్ టౌన్ పీఎస్ పరిధిలో రెండు, మావలా పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కాగా గోపాల్‌కు సహకరిస్తున్న ఆకాష్ పరారీలో ఉన్నాడు. నిందితుడిని పట్టుకోవడంతో కీలకంగా వ్యవహరించి పేట్‌బషీరాబాద్ డీఐ లక్ష్మీనారాయణరెడ్డి, సీఐ ప్రశాంత్‌ను బాలానగర్ డీసీపీ సందీప్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగ రాజు అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు

## నిర్మాణ్ కేంద్రంలో పండ్ల పంపిణీ


పండ్లు అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

చింతల్: చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలోని నిర్మాణ్ అనాథ, మానసిక వికలాగుల కేంద్రాన్ని గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులకు పండ్ల పంచిపెట్టారు. ఎంఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనాథలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అనాథ పిల్లలను గుర్తించి వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ నిర్వాహకురాలు సాలేహా బేగం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిలువేరు శ్రీనివాస్, యాదగిరి, నరసింహులు, జ్యోతి, రాణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు


సాయికృపాకాలనీలో పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్, అధికారులు

కుత్బుల్లాపూర్: మౌలిక వసతులను మెరుగు పరిచి ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపల్ 4వ వార్డులోని సాయికృపా కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు సువర్ణ, చింతల రవీందర్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## నేటి నుంచి చిత్తారమ్మదేవి జాతర


కొలువైన చిత్తారమ్మ


జాతరకు ముస్తాబైన చిత్తారమ్మ ఆలయం



సుభాష్‌నగర్: గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మదేవి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న జాతరకు ఆలయం ముస్తాబైంది. ఆలయానికి ఇరువైపులా కిలోమీటర్ మేర మైకులను, స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్ పేర్కొన్నారు. మొదటి రోజు ఉదయం గణపతి, పూజ పుణ్యా వచనం, పంచగవ్య ప్రాసన దీక్షధారణ మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

## చెట్టు చెదరకుండా.. పునరుజ్జీవం



జాతీయ రహదారి-44 విస్తరణలో భాగంగా సుచిత్ర నుంచి కొంపల్లి వరకు జరుగుతున్న పనులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. అయితే కొన్ని చెట్లను తిరిగి నాటే విధంగా వాటిని వేర్లతో సహా భారీ వాహనంలో దూలపల్లి ఫారెస్ట్ ఏరియాకు తరలించి అక్కడ నాటే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సుమారు 8 కిలోమీటర్ల మేర జరుగుతున్న ఈ విస్తరణలో అధిక శాతం చెట్లు తొలగించే ఆస్కారం ఏర్పడింది. దీంతో జాతీయ రహదారి అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ భారీ వృక్షాలను జాగ్రత్తగా తొలగించి వేరే చోట నాటే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గురువారం సత్యం ఎన్‌క్లేవ్ సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డులో చెట్లను తొలగించి వాహనంలో ఎక్కిస్తుండగా పలువురు ఆసక్తిగా గమనించి ఎక్కడ నాటుతున్నారు.! అని వివరాలు తెలుసుకోవడం విశేషం. - కుత్బుల్లాపూర్

## తప్పలేదు అందుకే.. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్



గాలి పటాలు విద్యుత్ తీగలకు తాకడంతో రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ సహాయంతో తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను అందిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ప్రాగా టూల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ శంకర్ నాయక్ 'సాక్షి'కి తెలియజేశారు. - రంగారెడ్డినగర్

## పుష్పై పూసిన మోదుగు చెట్టు



సుభాష్‌నగర్: మోదుగు చెట్టుకు వేసవి ప్రారంభంలో నారింజ రంగుతో పూలు పూస్తాయి. ఈ చెట్టు విస్తరాకులను ఇవ్వడమే కాకుండా, వీటి పూలను నీటిలో మరుగపెడితే ఎలాంటి రసాయనాలు లేని సహజ సిద్ధంగా రంగు నీళ్లు తయారవుతాయి. ఈ రంగు నీళ్లతో హోలీ ఆడుతారు. ఇవి నగరంలో చాలా అరుదుగా కనిపిస్తాయి. వేసవి కాలం రాకముందే గాజులరామారంలోని లాల్‌సాహెబ్‌గూడకు వెళ్లే దారిలో ఎర్రటి పుష్పాలు విరగ కాసిన మోదుగుచెట్టు కనువిందు చేస్తోంది.